


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శనివారం 27-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 178 | పేజీలు:4 | వెల: రూ.1/-


# పెట్రోధరలకు నిరసనగా బంద్

## వ్యాపార వర్గాల బంద్‌కు కార్మిక సంఘాల మద్దతు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్ ధరలకు నిరసనతో పాటు జీఎస్టీ నిబంధన లను సమీక్షించాలంటూ అఖిల భారత వ్యాపారుల సమాఖ్య భారత్ బంద్ నిర్వహించింది. దేశం మొత్తం ఇంధన ధరలు ఒకేలా ఉండాలని సమాఖ్య జనరల్ సెక్రటరీ ప్రవీణ్ ఖండేల్ వాల్ డిమాండ్ చేశారు. బంద్ లో 40 వేల వాణిజ్య సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 15 వందల ప్రాంతాల్లో నిరసనలు చేస్తున్నామన్నారు. భారత్ బంద్ కు అఖిల భారత రవాణా సంక్షేమ సంఘం మద్దతు తెలిపింది.జీఎస్టీ నిబంధనల్లో సవరణలు చేయాలని గత ఆదివారమే ప్రధాని మోడీకి లేఖ రాసింది అఖిల భారత వ్యాపారుల సమాఖ్య. ఈ కామర్స్ సంస్థలను నియంత్రించాలని కోరింది. జీఎస్టీ బిల్లులో సవరణలకు కేంద్రస్థాయి అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలని సమాఖ్య ప్రతినిధులు అన్నారు.

బంద్‌కు దేశ వ్యాప్తంగా పలు కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలిపాయి. దీంతో పాటు అఖిలభారత వాహనదారుల సంక్షేమ సంఘం కూడా సంపూర్ణ మద్దతు పలికింది. పెరుగుతున్న పెట్రోలియం ధరలతోపాటు ఎలక్ట్రానిక్ వే బిల్లు నిబంధనలు, జీఎస్టీ తదితర అంశాలకు వ్యతిరేకంగా బంద్ చేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, దేశ వ్యాప్తంగా ధరలు ఒకే విధంగా ఉండాలని ఆల్ ఇండియా ట్రేడర్స్ డిమాండ్ చేస్తోంది. వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ రైతులు చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనం లానే 'చక్కా జామ్' నిర్వహిస్తామని ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రకటించింది. మరోవైపు వివిధ సంఘాల నేతలు ప్రధాని మోదీకి లేఖ రాశారు. డీజిల్ ధరలు తగ్గించాలని, జీఎస్టీని సమీక్షించి సిఫార్సులు చేయడానికి ఓ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత్ బంద్‌కు దేశంలోని దాదాపు 40వేల కార్మిక సంఘాలు మద్దతు తెలపగా సుమారు 8 కోట్ల మంది వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నారు.

# వైద్యవిద్యలో పారదర్శక విధానాలు

**ఆరేళ్లలో 30వేలకు పైగా ఎంబీబీఎస్, 24వేల పీజీ సీట్లు పెంచాం**
**కరోనాతో వైద్యులపై గౌరవం పెరిగింది**
**ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): వైద్య విద్యలో పారదర్శకత పాటిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు.తమిళనాడులోని డాక్టర్ ఎంజీఆర్ మెడికల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వర్చువల్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 80 శాతం పీజీ సీట్లను, 50శాతం ఎంబీబీఎస్ సీట్లను పెంచామని అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు గత ఆరేళ్లలో 30వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు, 24వేల పీజీ సీట్లు పెంచామన్నారు. దేశంలో కొత్తగా 15 ఎయిమ్స్‌లకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో అత్యంత గౌరవనీయమైన వృత్తిలో వైద్యులు ఉన్నారని మోదీ అన్నారు. ఈ కరోనా కాలంలో వారి పట్ల గౌరవం మరింత పెరిగిందన్నారు. వైద్య వృత్తి పట్ల అవగాహన పెరగడంతోనే వైద్యులను గౌరవిస్తున్నా రన్నారు. ఎవరికైనా ఇది జీవన్మరణ సమస్యలాంటిదేనన్నారు. గంభీరంగా ఉండటం, సమస్యను తీవ్రంగా పరిగణించడం రెండూ వేరని.. ఈ రెండింటి పట్ల అవగాహనతో వ్యవహరించాలన్నారు. రోగులతో మాట్లాడేటప్పుడు సెన్సాఫ్ హ్యూమర్‌తో వ్యవహరించాలని వైద్యులను ప్రధాని కోరారు. రోగులతో సుహృద్భావంతో వ్యవహరించడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. భారతీయ ఆరోగ్య వ్యవస్థను ఇప్పుడు అందరూ కొత్త కళ్లతో, కొత్త గౌరవంతో, కొత్త విశ్వాసంతో చూస్తున్నారని ఆయన అన్నారు. యావత్ ప్రపంచం కూడా ఇప్పుడు మీపై దృష్టిపెట్టిందని, యువ భుజస్కంధాలపై ఆ బాధ్యత ఉందని మోదీ అన్నారు. పరీక్షల్లో మార్కులు సాధించడంతో పాటు.. సమాజంలో పేరు సంపాదించుకునే సంధి కాలంలో మీరున్నారని, కోవిడ్ మహమ్మారి వేళ భారత్ కొత్త వంధాలను వెలుగుచూసిందని, భారత్‌లో కోవిడ్ మరణాల రేటు తక్కువగా ఉందని, అలాగే రికవరీ రేటు అధికంగా ఉందని ప్రధాని తెలిపారు. శ్రీలంకలోని డిక్ ఓయా హాస్పిటల్ ప్రారంభోత్సవాన్ని తానెప్పుడూ మరిచిపోనన్నారు. ఈ ఆధునిక హాస్పిటల్ ఎందరికో సేవ చేస్తుందన్నారు. శ్రీలంకలో ఉన్న తమిళుల ఆరోగ్యం కోసం పనిచేసేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని చెప్పారు.ఆరోగ్య రంగంలో ఈ హాస్పిటల్ వల్ల తమిళ వర్గానికి మేలు జరుగుతుందని, ఎంజీఆర్ ఉండి ఉంటే ఎంతో సంతోషించేవారని ప్రధాని మోదీ అన్నారు. ఎంజీఆర్ పేద ప్రజల పట్ల ఎంతో ఉదారతతో ఉండేవారన్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత వంటి అంశాలను ఆయన పట్టించుకునేవారన్నారు. శ్రీలంకలో ఎంజీఆర్ పుట్టిన గ్రామాన్ని కొన్నేళ్ల క్రితం తాను సందర్శించినట్లు తెలిపారు.

# సినీ ఫక్కీలో కిడ్నాపర్ల అరెస్ట్

## మెరుపువేగంతో స్పందించిన పోలీసులు

## మూడు గంటల్లోనే కిడ్నాపర్ల చెర నుంచి వ్యక్తికి విముక్తి

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ పోలీసులు మెరుపు వేగంతో స్పందించి కిడ్నాపర్ల చెరనుంచి ఓ వ్యక్తిని కాపాడారు. అలాగే కిడ్నాపర్లను కూడా అరెస్ట్ చేశారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ వ్యవహారాన్ని సిపి అంజనీకుమార్ వివరించారు. తన భర్తను ఎవరో కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నారని బాధితురాలి ఫిర్యాదుపై హైదరాబాద్ పోలీసులు మెరుపువేగంతో స్పందించారు. కిడ్నాపర్లు డిమాండ్ చేసిన డబ్బును బాధితురాలికిచ్చి.. ఆమె ద్వారా కిడ్నాపర్ల ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేశారు. కిడ్నాప్ జరిగిన 3గంటల్లోనే కేసును ఛేదించి శభాష్ పోలీస్.. అనిపించుకున్నారు హైదరాబాద్ పోలీసులు. హైదరాబాద్ నగరంలోని శ్రీనగర్ కాలనీలో అమర్నాథరెడ్డి అనే వ్యక్తి కిడ్నాప్ అయ్యాడు. ఇవాళ ఉదయం మాదాపూర్ ఆఫీసుకు వెళ్లిన ఆయనను ఆరుగురు దుండగులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఆయన భార్యకు ఫోన్ చేసి మీ ఆయనను కిడ్నాప్ చేశాం.. డబ్బులివ్వకపోతే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో అంత డబ్బు ఎక్కడి నుండి ఎక్కడినుండి తేవాలో అర్థం కాక బాధితురాలు అమర్నాథరెడ్డి భార్య కల్పనారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలికి పోలీసులు అభయం ఇవ్వడమే కాదు..కిడ్నాపర్లు అడిగినంత డబ్బును రెడీ చేసి ఆమెకు ఇస్తామని అభయం ఇచ్చారు. బాధితురాలికి కిడ్నాపర్లు చెప్పినట్లు చేయమని ఆదేశించి సాంకేతికంగా నిఘా పెట్టారు. బాధితురాలు వెంటనే డబ్బు అరేంజ్ చేసుకున్నానని ఎక్కడికి రావాలంటూ కిడ్నాపర్లు కోరగా.. శ్రీనగర్ కాలనీకి తీసుకురమ్మని చెప్పారు. కిడ్నాపర్లలో ప్రదీప్ నటరాజన్, లోకేష్ లు వనస్థలిపురం నుండి శ్రీనగర్ కాలనీకి వచ్చి బాధితురాలి దగ్గర డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించారు. లోకేష్ శ్రీనగర్ కాలనీలో డబ్బులు తీసుకుని వెళ్లిపోతుండగా.. మఫ్టీలో ఉన్న పోలీసులు వెంటపడడం దూరంలో ఉంటూ గమనిస్తున్న ప్రదీప్ నటరాజన్ గుర్తించి పారిపోయాడు. లోకేష్ ను అదుపులోకి తీసుకున్న హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, వెస్ట్ జోన్ జాయింట్ సీపీ ఆర్ శ్రీనివాస్ లు తమదైన శైలిలో విచారించారు. అమరనాథ్ రెడ్డికి కిడ్నాపర్లకు మధ్య ఆర్థిక పరమైన విభేదాలతో కిడ్నాప్ జరిగినట్లు గుర్తించారు. తాము అడిగినంత డబ్బు ఇవ్వక పోతే చైన్నైకి తీసుకొని పోయి హత్య చేస్తామని చెప్పి భయపెట్టిన కిడ్నాపర్లు నల్గొండ వద్ద ఉన్నట్లు మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించి అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురిని అరెస్టు చేయగా ఇద్దరు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.

# తెలంగాణలో ఉద్యోగ నియామకాల్లో అబద్దాలు

**ఇవ్వని ఉద్యోగాలపై లెక్కలతో మోసం**
**ఇంటికో ఉద్యోగం ఇస్తానని మోసం చేసింది నిజం కాదా**
**యూనివర్సిటీకి వస్తే చర్చిద్దామని బిజెపి నేత అరుణ సవాల్**

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): ఉద్యోగాల నియామకాల విషయంలో జూటా మాటలు కట్టిపెట్టాలని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఇవ్వని ఉద్యోగాలపై లెక్కలు చెబుతారా అని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరికీ దమ్ముంటే యూనివర్సిటీకి వస్తే.. ఉద్యోగాలపై చర్చిద్దామని బీజేపీ అరుణ సవాల్ విసిరారు. కేటీఆర్, కేసీఆర్‌లు పక్కా జూట కూతలు కూస్తున్నారని ఆమె మండిపడ్డారు. 'తెలంగాణ వస్తే ఆంధ్ర వాళ్ళు వెళ్ళిపోతారని.. ఇంటికో ఉద్యోగం వస్తుందని కేసీఆర్ చెబితే ప్రజలు నమ్మారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నడుపుతోంది కేటీఆరా? అని ప్రశ్నించారు. కేటీఆర్, కేసీఆర్‌లు పక్కా జూట కూతలు కూస్తున్నారు. పబ్లిక్ సెక్టర్ ఉద్యోగాలు కూడా మేమే ఇచ్చామని చెప్పుకోవడానికి సిగ్గు ఉండాలి. కొత్త ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చావో చెప్పు. విద్యాశాఖలో ఎన్ని భర్తీ చేశావో చెప్పాలి. తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులే ఉండరని కేసీఆర్ అన్నారు. కాలేజీలు ఉన్నవాళ్లను, యూనివర్సిటీలను పెట్టిన వాళ్లను పోటీలో పెట్టి మోసం చేస్తున్నారు. ఈ ఏడు ఏళ్లలో 40 వేల ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయితే భర్తీ చేసింది 32 వేలు మాత్రమే. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిందే తప్ప తగ్గలేదు.

తండ్రీకొడుకులిద్దరూ దమ్ముంటే యూనివర్సిటీకి రండి చర్చిద్దాం. తెలంగాణను కాపాడుకోవాలంటే కేటీఆర్‌ని ఓడించాల్సిందే. మీరు చెప్పింది వాస్తవమే అయితే మా సవాల్‌ని స్వీకరించాలి' అని డీకే అరుణ అన్నారు.రాష్ట్రంలో లక్ష ఉద్యోగాల కల్పనపై కేటీఆర్ విసిరిన సవాల్‌ను బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు స్వీకరించారు. లక్ష ఉద్యోగాల కల్పన అంశంపై కేటీఆర్‌తో చర్చకు సిద్ధమని బీజేపీ ప్రకటించింది. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని బీజేపీ పేర్కొంది. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి కేటీఆర్ రావాలని బీజేపీ సవాల్ విసిరింది. ఓయూకి వస్తే లెక్కలు తేలతాయని బీజేపీ నేతలు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలతో బహిరంగ లేఖను కేటీఆర్ విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే లక్ష ఉద్యోగాలిస్తామన్న మాటను నిలబెట్టుకున్నామన్నారు కేటీఆర్. కాంగ్రెస్ హయాం కంటే తామే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఉద్యోగకల్పన అంశంపై విపక్షాలకు మంత్రి కేటీఆర్ సవాల్‌తో రాజకీయం హీటెక్కింది. ఓ వైపు కాంగ్రెస్, మరోవైపు బీజేపీ ప్రతి సవాళ్లతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ అంచితమగు లక్ష్యము తో
సంచితమగు శక్తితోడ, సాధన తోడా
పెంచు కొనిన ప్రతిభలు "కు
ఉంచిన సామర్థ్యము జేసె "మెల్విన్ లోబో" !!

–రాధశ్రీ

సెల్: 9494481210



(ఫిబ్రవరి 27 :ఫుట్‌బాల్‌లో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన మెల్విన్ లోబో పుట్టిన రోజు..)

# పెరగనున్న పాలధరలు

**పెట్రో ధరలే కారణమంటున్న వ్యాపారులు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్): దేశంలో రోజురోజు పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న క్రమంలో వాటి ప్రభావం నిత్యావసర వస్తువులపై పడుతున్నది. వ్యాపారులు ఒక్కో వస్తు సేవల ధరలను క్రమంగా పెంచుతున్నారు. ఈ క్రమంలో వచ్చే నెల 1 నుంచి పాల ధరలను రూ.12 మేర పెంచాలని పాల ఉత్పత్తిదారులు నిర్ణయించారు. దీంతో మధ్యప్రదేశ్‌లోని రత్లామ్ పట్టణంలో లీటర్ పాల ధర రూ.55కు చేరనుంది. పట్టణంలోని కూరగాయలు, పాల ఉత్పత్తిదారుల సమావేశం ఈనెల 23న జరిగింది. ఈ సందర్భంగా పాల ధలను పెంచాలను నిర్ణయించారు. రత్లామ్‌లో ప్రస్తుతం లీటర్ పాలు రూ.43గా ఉన్నాయి.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పాల ధరలు కూడా పెంచాలని రత్లామ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హీరాలాల్ చౌదరీ డిమాండ్ చేశారు. గతేడాది పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పటికీ.. కరోనా వైరస్ నేపథ్యంలో పాల ధరలను పెంచలేదన్నారు. తాము ఒక్కో బర్రెను రూ. లక్ష నుంచి రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశామని, ప్రస్తుతం లీటర్ పాల ధర రూ.43గా ఉందని చెప్పారు. ఖర్చులు పెరుగుతుండటంతో పాల ధరను రూ.55కు పెంచాల్సి వస్తుందన్నారు. పెట్రో ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు, దానా చుక్కలనంటాయని తెలిపారు. పాల ధరల పెంపునకు అనుమతించకపోతే ఉత్పత్తిని నిలిపివేస్తామని హెచ్చరించారు.

# తాగిన మైకంలో గొంతుకోసుకున్న వ్యక్తి

హైదరాబాద్,ఫిబ్రవరి 26(ఆర్ఎన్): భార్యతో గొడవ పడ్డ భర్త.. మద్యం మత్తులో తన గొంతు తానే కోసుకున్నాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. నరేష్(30) అనే వ్యక్తి పీకల దాకా మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఆ తర్వాత భార్యతో అతను గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న నరేష్.. తనకు తానే కత్తితో గొంతు గోసుకున్నాడు. అప్రమత్తమైన భార్య స్థానికుల సహాయంతో భర్తను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వ్యాపారుల బంద్‌కు మద్దతుగా ఆందోళన

హైదరాబాద్,ఫిబ్రవరి 26(ఆర్ఎన్): అఖిల భారత వ్యాపార సంస్థలు తలపెట్టిన భారత్ బంద్‌కు మద్దతుగా సీపీఎం పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. శుక్రవారం నగరంలోని ఎల్బీనగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పన్నుల పేరిట ప్రజలపై, వ్యాపారులపై భారం వేస్తుందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలకు భారం వేసి ఇబ్బందులకి గురిచేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు.

# తెలంగాణలో కరోనా కేసులు తగ్గుముఖం

**అయినా అప్రమత్తంగా ఉండాలన్న వైద్యులు**

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచించారు. తాజాగా గడిచిన 24 గంటల్లో 189 కరోనా కేసులు నమోదు కాగా.. ఇద్దరు మృతి చెందారు. దీంతో మొత్తం ఇప్పటి వరకు రాష్ట్రంలో పాజిటీవ్ కేసుల సంఖ్య 2,98,453కి చేరింది. 1632 మంది మరణించారు. ప్రస్తుతం తెలంగాణలో 1910 యాక్టివ్ కేసులు ఉన్నాయని, కరోనా చికిత్స నుంచి కోలుకుని 2,94,911 మంది బాధితులు డిశ్చార్జ్ అయ్యారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొంది. కాగా 1910 యక్టివ్ కేసులలో 818 మంది ఐసోలాషన్‌లో వున్నారు

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): దేశంలో పసిడి ధరలు స్వల్పంగా దిగిరాగా, వెండి ధర భారీగా తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.342 తగ్గి రూ.45,599కి చేరింది. క్రితం ట్రేడ్‌లో తులం బంగారం ధర రూ.45,941 వద్ద ముగిసింది. అంతరా జీయ మార్కెట్‌లలో ఇవాళ బంగారం, వెండి కొనుగోళ్లకు పెద్దగా డిమాండ్ లేకపోవడమే దేశీయంగా వాటి ధరలు దిగిరావడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు. ఇక వెండి ధరలైతే భారీగా తగ్గాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.2,007 తగ్గి రూ.67,419కి పడిపోయింది. క్రితం ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.69,426 వద్ద ముగిసింది. ఇదిలావుంటే ఇవాళ అంతర్జాతీయ మార్కెట్‌లలో ఔన్స్ బంగారం ధర 1,760 అమెరికన్ డాలర్లు, ఔన్స్ వెండి ధర 26.78 అమెరికన్ డాలర్లు పలికింది.

# సిపిఐ తమిళనాడునేత పాండియన్ కన్నుమూత

చెన్నై,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): సీపీఐ సీనియర్ నేత డి.పాండియన్ సుదీర్ఘ అస్వస్థతతో శుక్రవారంనాడు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయస్సు 89 సంవత్సరాలు. కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయన తరచు హెమోడయాలసిస్ చేయించుకుంటున్నారు. రక్తంలో షుగర్ స్థాయి బాగా పడిపోవడంతో స్పృహతప్పిన ఆయనను గురువారం రాత్రి ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వెండిలేటర్ సపోర్ట్‌తో వైద్యులు చికిత్స అందిచగా, ఉదయం 10.15 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం దివంగత జె.జయలలితకు అత్యంత సన్నిహితంగా పాండియన్ ఉండేవారు. సీపీఐ తమిళనాడు విభాగం అధ్యక్షుడిగా మూడు సార్లు పనిచేశారు. 1989, 1991లో ఆయన రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూడా మూడుసార్లు పనిచేశారు. కార్మిక సంక్షేమం కోసం యూనియన్ నేతగా పోరాటాలు చేసిన ఆయన చిన్న వయస్సులోనే సీపీఐ జాతీయ కార్యదర్శి అయ్యారు. రచనలు చేయడంలోనూ అసమాన ప్రతిభ

## సంతాపం తెలిపిన పలువురు నేతలు



చూపేవారు. పార్టీ జర్నల్ 'జనశక్తి' కోసం తుది శ్వాస వరకూ అనేక ఆర్టికల్స్ రాశారు. తన జీవితకాలంలో ఏడు పుస్తకాలు రచించగా, ఆరు నవల్స్‌ను అనువదించారు. పాండియన్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం తెలిపారు. డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తురసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, కాంగ్రెస్ నేత పీటర్ ఆల్ఫోన్స్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, అన్నాడీఎంకే డిప్యూటీ కోఆర్డినేటర్ కేపీ మునుస్వామి, వీసీకే నేత టి.తిరుమావలవన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో, తదితరులు సంతాపం తెలిపారు. పాండియన్ మృతి రాష్ట్రానికి తీరనిలోటని తమ సంతాప సందేశాల్లో పేర్కొన్నారు.

# దూకుడుగా రుణాలిచ్చి దెబ్బతీసారు

## -బ్యాంకుల పనితీరును మెరుగు పరుస్తున్నాం: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): దూకుడుగా రుణాలిచ్చే పేరుతో పది పన్నెండేండ్ల కిందట దేశంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం తీవ్రంగా దెబ్బతిన్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పతనమైన పరపతి వ్యవస్థను చక్కదిద్ది పారదర్శకతను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గతంలో మాదిరి రాని బాకీలను కార్పెట్ కింద దాచేందుకు బదులు ఒక్కరోజు బకాయి పడిన బాకీలను వెల్లడించడం తప్పనిసరి చేశామని అన్నారు. అయితే వ్యాపారంలో ఒడిదుడుకులను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని, ప్రతి వ్యాపార నిర్ణయానికి దురుద్దేశాన్ని ఆపాదించరాదని గుర్తెరిగిందని పేర్కొన్నారు. ఆర్థిక సేవల రంగానికి బ్జడెట్ కేటాయింపులు, నిబంధనల అమలుకు సంబంధించి ప్రధాని మోదీ శుక్రవారం ఓ వెబినార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి డిపాజిటర్, ఇన్వెస్టర్‌కు నమ్మకం, పారదర్శకతను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బ్యాంకింగ్, బ్యాం కిగేతర రంగాల్లో పాత పద్ధతులకు స్వస్తి పలుకుతామని చెప్పారు. దేశ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ దిశగా బ్జడెట్‌లో పలు చర్యలను పొందుపరిచామని గుర్తుచేశారు.

## "రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..





రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

**మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?**

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజ్‌మేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్క్రిప్ట్–7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

**ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.**





# స్వచ్ఛ వేములవాడకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలి

## -మూలవాగులో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో పాల్గొన్న కలెక్టర్ కృష్ణ భాస్కర్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి):పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకునే భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందని, వేములవాడ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చి దిద్దడానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టర్ వేములవాడ పట్టణంలోని మూలవాగు శివారులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో పాల్గొన్నారు.మహా శివరాత్రి నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మూలవాగును లో పేరుకుపోయి ఉన్న చెత్త, చెదారాన్ని శుభ్రం చేయడం కోసం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ను చేపట్టడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. పట్టణ ప్రజలు, దేవస్థానానికి ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు చెత్త, చెదారాన్ని ఇష్టం వచ్చినట్లు పడేయకుండా, చెత్త బుట్టల్లో మాత్రమే వేయాలని సూచించారు. శివరాత్రి జాతర కల్లా ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయంగా ముందుకువచ్చి ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో పాల్గొనడం హర్షణీయం అన్నారు. ఈ డ్రైవ్ లో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మాధవి, వైస్ చైర్మన్ రాజేందర్, వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్లు శ్యాం సుందర్ రావు, సమ్మయ్య,సెస్ డైరెక్టర్ రామతీర్థ పు రాజుకౌన్సిలర్లుసిరి గిరి రామచంద్రం యాచమనేని శ్రీనివాస్ రావు, నరాల శేఖర్ , కందుల శ్రీ లత క్రాంతికుమార్, జొగం శంకర్,కుమ్మరి శిరీష శ్రీనివాస్, యువ ఫౌండేషన్ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# 24వ వార్డుని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని నా లక్ష్యం .కౌన్సిలర్ ఉమారాణి శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి):24 వార్డుని అభివృద్ధిలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమనిఆ వార్డు కౌన్సిలర్ అన్నారంఉ మారాణి శ్రీనివాస్ అన్నారు .

24వ వార్డులో ని ఆనందరెడ్డి హాస్పిటల్ మార్గం వద్ద మెయిన్ రోడ్ లింక్ వద్ద వార్డు ప్రజల ప్రయాణానికి చాలా ఇబ్బంది అయితున్న సందర్భంగా ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని మెయిన్ రోడ్ ను అనుసందానం చేస్తు సీసీ ర్యాంప్ వేయడం జరిగింది.గత కొన్ని రోజుల క్రితం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈ వార్డుల్లో మురికికాల్వల నుండి వెదజల్లుతున్న దుర్గంధ నివారణకు చర్యలు తీసుకున్నామని అన్నారు .దీనికి సహకరించిన చైర్ పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు , కమిషనర్ శ్యాంసుందర్ రావుకు కౌన్సిలర్ ఉమారాణి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు .

# నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీ నియమించిన మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26: (నేటినిజం ప్రతినిధి): కొలనూర్ గ్రామం లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లం కమలాకర్, ఉపాధ్యక్షులు గా తాల్లపెల్లి విజయ్, గద్ద మల్లేశం ప్రధాన కార్యదర్శి గా మెరుగు బుచ్చి రాములు కోశాధికారి గా ఇస్తారి నవీన్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లోఎంపీటీసీ ఇస్తారి ప్రవీణ్ కుమార్ విరవేణి తిరుపతి విరవేణి దేవేందర్ విరవేణి రాజయ్య జి.సంజీవ్ , నరేష్ , శ్రీను, అస్సాం, కొరెపు సామి, నర్సయ్య ,ప్రభాకర్ శోభన్ ,సత్యం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# మిషన్ భగీరథ భేష్ : కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


నల్లగొండ, ఫిబ్రవరి 26:ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం భేష్ అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

జిల్లాలోని చండూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పల్లె కల్యాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మినరల్ వాటర్ కన్నా మిషన్ భగీరథ నీళ్లు సురక్షితమైనవని, మనిషికి అవసరమైన మినరల్స్ అన్నీ సమపాలల్లో ఉన్నాయని అన్నారు.

నూటికి నూరు శాతం ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ ఈ నీటిని అందించాలని చెప్పారు.

కొన్ని గ్రామాల్లో ఇంకా పనులు పూర్తికాకున్నా అధికారులు మెప్పు కోసం తప్పుడు నివేదికలు అందించి సీఎంను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా క్షేత్ర స్థాయిలో సమీక్షించి అందరికీ మిషన్ భగీరథ జలాలు అందించాలని సూచించారు.


తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్
(Regd. No. 1522/2018)
సంయుక్తంగా నిర్వహించే
'తెలంగాణ సాహిత్యం : నాడు-నేడు'
అన్న అంశంపై జరిగే ఒకరోజు జాతీయ సదస్సు కు
ఆహ్వానం
తేది : 03-03-2021, బుధవారం, ఉ॥ 10 గం॥లకు
వేదిక : డా. బి.ఆర్.అంబేడ్కర్ కాన్ఫరెన్స్ హాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్, హైదరాబాద్.
ప్రారంభ సమావేశం ఉ. 10.00 గంటలకు



ముఖ్యఅతిథి, జాతీయ సదస్సు ప్రారంభకులు
శ్రీ గోరటి వెంకన్న
గౌరవ శాసన మండలి సభ్యులు, తెలంగాణ ప్రభుత్వం
'ఎవరెస్టు కన్నా ఉన్నతం' గ్రంథావిష్కరణ
(పుల్వామా అమర సైనికులకు కవుల నివాళి)
విశిష్ట అతిథి
శ్రీ దేశపతి శ్రీనివాస్
ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారి, తెలంగాణ ప్రభుత్వం
అధ్యక్షులు
డా. డి.ఎస్.ఆర్.రాజేందర్ సింగ్
ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్ & జాయింట్ డైరెక్టర్ (FAC)
కళాశాల విద్యా కమీషనర్ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం
గౌరవ అతిథి
శ్రీ ఘణపురం దేవేందర్, ప్రముఖ కవి
స్వాగత ప్రసంగం
డా. గంటా జలంధర్ రెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్
సదస్సు సంచాలకులు
సమావేశకర్త
శ్రీమతి నిదానకవి నీరజ
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్


# గ్రంధి శ్రీనివాసా వ్యాఖ్యలపై మండిపడ్డ పవన్

## వీధి, కుక్కలు అరుస్తాయంటూ కౌంటర్

అమరావతి,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్న శ్రీనివాస్.. ఓ వీధి రౌడీ, బ్యాంకులను దోచేసిన వ్యక్తి అని... ఆయన నుంచి ఇంతకంటే ఎక్కువ ఏమి ఆశిస్తామని పవన్ అన్నారు. వారి దాడులను ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసని... దాడులు చేస్తే చూస్తూ కూర్చోమని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఓ వీడియో ప్రకటన విడుదల చేసిన పవన్.. వైసీపీ ఎమ్మెల్యే ఆగడాలను కట్టడి చేయాలని డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను కోరారు. లేదంటే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించేంత సంయమనం తమ దగ్గర లేదన్నారు. దళితులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు అక్రమంగా బనాయిస్తే... మానవహక్కుల సంఘానికి తాను స్వయంగ వెళ్లి ఫిర్యాదు చేస్తానన్నారు. దళితులను రక్షించాల్సిన చట్టాన్నే దళితులపై ప్రయోగిస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా దూషణలకు దిగుతున్న... వైసీపీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాటలను... జనసేన శ్రేణులు పట్టించుకోవద్దని సూచించారు. వీధిలో కొన్ని కుక్కలు అరుస్తాయి... కొన్ని పిచ్చికుక్కలు కరుస్తాయి. కరిచినంత మాత్రాన ఆ కుక్కను మనం కరవం కదా. మున్సిపాలిటీ వాళ్లకు ఫోన్ చేస్తాం. వచ్చే వరకు ఆగుతాం. మీకు మాటిస్తున్నాను. మున్సిపాలిటి వ్యాన్ వస్తుంది... అప్పటి వరకు సంయమనం పాటించండని పవన్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలపించండి: కన్నా

అమరావతి,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): మున్సిపాలిటీల్లో బీజేపీ, జనసేనను గెలిపిస్తే అవినీతి రహిత పాలనను తెస్తామని బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ ప్రకటించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలకు దోపిడీ తప్ప వేరే ఏమీ లేదన్నారు. పల్నాడు ప్రాంతంలో ఎమ్మెల్యేలు అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, ఎస్ఈసీ మరోసారి నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని కన్నా లక్ష్మీనారాయణ కోరారు.

# అలిపిరి టోల్ ఫీజు డబుల్

## -ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం

తిరుపతి,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): అలిపిరి దగ్గర ఉన్న టోల్‌గేట్ ఛార్జీలు పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు వసూలు చేస్తున్న టోల్‌గేట్ ఛార్జీల్లో సవరణలు చేసింది. టోల్ ఛార్జీలను పెంచుతూ గతేడాది మార్చిలో తితిదే బోర్డు చేసిన తీర్మానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. అలిపిరి ఘాట్‌రోడ్డులో వెళ్లే బైక్‌ల టోల్‌ఫీజును పూర్తిగా రద్దు చేసింది. ఇకపై కార్లు, జీపులు, టాటాఏస్, టాక్సీలకు రూ.15 నుంచి రూ.50 మినీ బస్సులు, మినీ లారీలకు రూ.50 నుంచి రూ.100కి పెంచింది. లారీ, బస్సుల టోల్ ఫీజును రూ.100 నుంచి రూ.200కు పెం చుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించండి

## -నారా లోకేశ్ ట్వీట్

అమరావతి,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. ఫ్లలెలు గెలిచాయని, ఇప్పుడిక మనవంతు అని ట్విటర్‌లో పేర్కొన్నారు. పట్టణాల అభివృద్ధి కోసం 10 వాగ్దానాలతో మ్యానిఫెస్టో విడుదల చేసామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. పురపాలక ఎన్నికల్లో గెలిస్తే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామన్నారు. 21 నెలల జగన్ రెడ్డి పాలనలో పట్టణాల అభివృద్ధి

శూన్యమన్నారు. కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చలేని అసమర్ధ ప్రభుత్వాన్ని చూశామన్నారు. ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేసాడని, మరో ఛాన్స్ ఇస్తే ప్రజల జీవితాలను నాశనం చేస్తాడని సీఎం జగన్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఆలోచించి ఓటు వెయ్యండని ట్వీట్ చేశారు. అని ట్విటర్‌లో పేర్కొన్నారు. పట్టణాల అభివృద్ధి కోసం 10 వాగ్దానాలతో మ్యానిఫెస్టో విడుదల చేసామని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. పురపాలక ఎన్నికల్లో గెలిస్తే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామన్నారు. 21 నెలల జగన్ రెడ్డి పాలనలో పట్టణాల అభివృద్ధి శూన్యమన్నారు. కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చలేని అసమర్ధ ప్రభుత్వాన్ని చూశామన్నారు. ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశాడని, మరో ఛాన్స్ ఇస్తే ప్రజల జీవితాలను నాశనం చేస్తాడని సీఎం జగన్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

# ఉద్యోగ సాధనలో లింగ సమానత్వం ఫలిస్తోంది...!

## (తాజాగా విడుదలైన 'ఇండియా స్కిల్ రిపోర్ట్-2021' ఆధారంగా)

మన దేశంలో ఉన్నత విద్యను అభ్యసించిన నైపుణ్య యువతలో పురుషులకు సమానంగా మహిళా శాస్త్రసాంకేతిక నిపుణులు ఉద్యోగ సాధనలో సఫలం అవుతున్నారని 'ఇండియా నైపుణ్యాల నివేదిక-2021' తేటతెల్లం చేసింది. ఏఐసిటిఈ, సిఐఐ, ఏఐయు, టగ్ద్ మరియు యుయన్‌డిపిల సహకారంతో వీబాక్స్ నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ ఆధారంగా సర్వే సారాంశాన్ని 'ఇండియా స్కిల్ రిపోర్ట్-2021' పేరుతో విడుదల చేశారు. ఈ సర్వే వివరాల ప్రకారం 2021లో 45.9 శాతం (2020లో 46.21 శాతం మరియు 2019లో 47.38 శాతం) ఫైనల్ ఇయర్ యువతీయువకులు ఉద్యోగ సాధన నైపుణ్య వికాస వనరులు కలిగి ఉన్నారని తెలుస్తున్నది. మహిళా అభ్యర్థుల్లో 46.8 శాతం మరియు పురుషుల్లో 45.91 శాతం ఉద్యోగ సాధన నైపుణ్యాలు స్వంతం చేసుకుంటున్నారు. దేశంలోన మహానగరాల్లో అత్యధికంగా ముంబాయ్‌కి చెందిన 70 శాతం యువత (60 శాతం కన్న ఎక్కువ) ఉద్యోగ సాధన నైపుణ్యాలను కలిగి ఉన్నారని, తరువాత స్థానంలో హైదరాబాద్ యువత ద్వితీయ స్థానంలో నైపుణ్య వనరులు సాధించడం జరిగిందని వివరించింది. ఈ నివేదిక ప్రకారం ఢిల్లీ, యుపి, ఒరిస్సా రాష్ట్రాలలో అధిక సంఖ్యలో ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన యువత ఉన్నారని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 15 పారిశ్రామిక రంగాలకు చెందిన 150 కి పైగా కార్పొరేట్స్ సర్వేలో పాల్గొన్నారు. హైదరాబాద్, బెంగుళూరు మరియు పూనె మహానగరాల్లో నైపుణ్య యువత అధికంగా ఉండటం గమనించారు. వీబాక్స్ నిర్వహించిన 8వ సర్వేలో జాతీయ స్థాయిలో ఫైనల్ ఇయర్ యువతలో ఉద్యోగ సాధన నైపుణ్యాల స్థాయిని పరీక్షించారు. అధిక ఉద్యోగాలు కలిపిస్తున్న రంగాల్లో బ్యాంకింగ్ మరియు ఫైనాన్సియల్ రంగం, ఐటీ మరియు ఐటీ ఆధారిత వ్యాపారాలు, ఆరోగ్య, ఆటోమొబైల్స్, రిటైల్, లాజిస్టిక్స్ మరియు శక్తి ఉత్పత్తి కేంద్రాల వంటి రంగాలు ముందున్నాయి. ఢిల్లీ, కర్నాటక మరియు మహారాష్ట్రల్లో ఉద్యోగాల నియామకాలు అధికంగా జరుగుతున్నాయి. గతంలో 10 శాతం యువతకు మాత్రమే ఉద్యోగాలు లభించగా, నేడు 19 శాతం యువత ఉద్యోగాలకు ఎంపిక కావడం జరుగుతోంది.

ఇండియాలో డిజిటల్ ఉద్యమం ఫలితంగా గత 5 సంవత్సరాలతో పోల్చితే పురుషులతో పోటీ పడుతూ మహిళలు నైపుణ్య వనరులు కలిగి ఉద్యోగాలు పొందుతూ లింగ సమానత్వ దిశగా కదలడం సంతోషదాయకమని చెప్పవచ్చు. ఉద్యోగ సాధనలో 64 శాతం పురుషులు మరియు 36 శాతం మహిళలు సఫలమవుతున్నారు. బ్యాంకింగ్ మరియు ఫైనాన్సియల్ రంగాల్లో అధికంగా 46 శాతం మహిళలు ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఇదే క్రమంలో మహిళలు సాగితే రాబోయే సంవత్సరాల్లో పురుషులతో సమానంగా లేదా అంతకన్న ఎక్కువ మంది స్త్రీలు ఉద్యోగాలు సాధిస్తారని నివేదిక తెలియజేస్తున్నది. వీబాక్స్ నిర్వహించిన ఉద్యోగ సాధన నైపుణ్య పరీక్షలో కమ్యునికేషన్, క్రిటికల్ థింకింగ్ మరియు న్యూమరికల్ రీజనింగ్ రంగాలలో విశ్లేషించడం జరిగింది. 2021 ఫైనల్ ఇయర్ బిటెక్ యువత 46.82 శాతం మరియు యంబిఏ పూర్తి చేసే యువతకు 46.59 శాతం ఉద్యోగ సాధన నైపుణ్యాలు ఉన్నాయని వెల్లడైంది. బికామ్ (40.30 శాతం), బిఏ (42.72 శాతం), బిఫార్మసీ (37.24 శాతం) మరియు బియస్‌సి (30.34 శాతం) అభ్యర్థులు నైపుణ్య సాధనలో తరువాత స్థానాల్లో నిలిచారు. యంసిఏ అభ్యర్థులు 22.42 శాతం మరియు పాలిటెక్నిక్‌లో 25.02 శాతం యువత నైపుణ్యాలను సొంతం చేసుకుంటున్నారు. పర్యాటక, శక్తి జనన మరియు మన్యుఫాక్చరింగ్ రంగాలకు చెందిన సాఫ్ట్‌వేర్ మరియు హార్డ్‌వేర్ పరిజ్ఞానం కలిగిన యువతకు ఉద్యోగాలు లభించడం తేలిక అవుతున్నది. పురుషులతో పోల్చితే మహిళా అభ్యర్థలకు నైపుణ్య అర్హతలు అధికంగా ఉన్నప్పటికీ ఎక్కువ ఉద్యోగాల్లో పురుషులు ఎంపిక కావడం జరుగుతోందని వివరించబడింది. ఇంటర్నెట్ సంబంధ ఉద్యోగాల్లో 39 శాతం మహిళలు మరియు ఆటోమొబైల్స్‌లో 75 శాతం మరియు ఎనర్జీ రంగంలో 72 శాతం పురుషులు ఉద్యోగాలు పొందుతున్నారు.

'కెరీర్ అవుట్‌లుక్ రిపోర్ట్' ప్రకారం ఫైనల్ ఇయర్‌లో ఉన్న ఫ్రెషర్స్ సమకాలీన ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు నైపుణ్య వికాసాన్ని (రీజనింగ్, అనలిటికల్ థింకింగ్, కాంప్లెక్స్ ప్రబ్లమ్ సాల్వింగ్, అక్టివ్ లెర్నింగ్, క్రిటికల్ రీజనింగ్ లాంటివి) అధికంగా కలిగి ఉంటారని, అలాంటి ఫ్రెషర్స్ కోసం కంపెనీలు 65 శాతం నియామకాలు చేపట్టేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు తేలింది. నేటి యువత ఆటోమేషన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మరియు గ్రాఫిక్ డిజైనింగ్ రంగాలకు చెందిన నైపుణ్యాలను ఆకలింపు చేసుకున్నట్లు అయితే ఉద్యోగ సాధన సులభం అవుతుందని సూచించారు. కోవిడ్-19 అనంతర వేళ ఫిబ్రవరి - ఏప్రిల్-2021లో ప్రెషర్స్ కోసం ఉద్యోగాలు 2.5 రేట్లు పెరిగే అవకాశం ఉందని కూడా అంచనా వేశారు. సాంప్రదాయ డిగ్రీలు బిఫామ్, బియస్‌సి, పాలిటెక్నిక్ లాంటి కోర్సులు పూర్తి చేసిన యువత అవసర ఉద్యోగ సాధన నైపుణ్యాలను స్వంతం చేసుకోవడంలో విఫలం అవుతున్నారని విశ్లేషించబడింది. ఆధునిక యువత ఉన్నత విద్య పాఠ్యాంశాల విజ్ఞానంలో ప్రతిభతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలు మరియు సాంకేతిక నైపుణ్యాలు కలిగి ఉండడం కనీస ఉద్యోగ అర్హత అయిన వేళ నేటి యువత వీటిని స్వంతం చేసుకోవడానికి నిరంతర కృషి చేయటానికి సిద్ధంగా ఉండాలని కోరుకుందాం. నైపుణ్య వికాసమే ఉద్యోగ సాధనకు ఏకైక మార్గమని తల్లితండ్రులు, అధ్యాపకులు మరియు యువత గుర్తుంచుకుంటారని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# భారత్ బంద్‌తో స్తంభించిన రవాణా

## ఎక్కడికక్కడ నిలిచిపోయిన లారీలు

## ఆటోలకు తాళ్లు కట్టి లాగి నిరసన తెలిపిన శశిథరూర్

హైదరాబాద్,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): దేశంలో ఇంధన ధరల పెంపునకు నిరసనగా భారత్ బంద్‌కు వాణిజ్య సంఘాలు పిలుపునివ్వడంతో రవాణాపై ప్రభావం చూపింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేరళ రాజధాని తిరువనంతపురంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆటోలకు తాళ్లు కట్టి రోడ్డుపైకి లాక్కొచ్చారు. చమురు ధరలు తగ్గించడంలో అటు కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఆ విషయాన్ని ఎత్తిచూపేందుకు ఆటోలను తాళ్లతో లాగామని వివరించారు. చమురు ధరల పెంపుతో ప్రజలను దోచుకుంటు న్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో వందలాది ఆటోలు పాల్గొన్నాయని థరూర్ వివరించారు. బంద్‌కు ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు పలు ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు మద్దతు తెలిపాయి. సిఏఐటి పిలుపుతో దేశవ్యాప్తంగా 40 వేల వ్యాపార సంఘాలు, 8 కోట్ల మంది వ్యాపారులు బంద్‌కు మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా చక్కా జామ్ నిర్వహించారు. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 80 లక్షల రవాణా వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోనున్నాయి. దేశవ్యాప్తంగా 1,500 ప్రాంతాల్లో నిరసనలు తెలుపుతున్నాయి. అయితే, మెడికల్, నిత్యావసరాలను బంద్ నుంచి మినహాయించారు. బంద్‌లో భాగంగా శుక్రవారం ఎక్కడి లారీలు అక్కడే నిలిపివేయాలని లారీ యజమానుల సంఘం పిలుపునివ్వడంతో రహదారులపై ఎక్కడికక్కడ వాహనాలు భారీ స్థాయిలో నిలిచిపోయాయి. ఏపిలోని విజయవాడలో రామవరప్పాడు, భవానీపురం, ఇబ్రహీంపట్నం, తాడేపల్లిలో లారీలు పెద్ద సంఖ్యలో నిలిచాయి. విశాఖలోని గాజువాక యార్డులో ట్రాన్స్‌పోర్ట్ లారీలు అక్కడే నిలిచిపోయాయి. ఈ రోజు ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక లారీ యార్డ్ నుంచి డాక్ యార్డు వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా వ్యాప్తంగా లారీలు నిలిచిపోయాయి. వరంగల్ నగరంలోని ఏనుమాముల మార్కెట్ దగ్గర 1,100 లారీలు నిలిచిపోయాయి.

# హిమాచాల్ అసెంబ్లీలో కాంగ్రెస్ హంగామా

## గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న నేతలు

## తోపులాటలో కిందపడ్డ గవర్నర్ దత్తాత్రేయ

## ఐదుగురు సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్

సిమ్లా,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): హిమాచల్ అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు హంగామా సృష్టించారు. బడ్జెట్ సమావేశాల తొలిరోజు సభలోగవర్నర్ బండారు దత్తాత్రేయను అడ్డుకునే ప్రయత్నం చేశారు. శుక్రవారం బడ్జెట్ సమావేశాల తొలిరోజు రాష్ట్ర అసెంబ్లీ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను ఘెరావ్ చేశారు. ఈ తోపులాటలో దత్తాత్రేయ కిందపడ్డారు. ఈ ఘటన అనంతరం ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. బడ్జెట్ సమావేశాలు జరిగినన్ని రోజులు సభకు రాకుండా వారిని సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిలో కాంగ్రెస్ విపక్ష నేత ముఖేష్ అగ్నిహోత్రితో పాటు ఎమ్మెల్యేలు హర్ష వర్ధన్ చౌహాన్, సుందర్ సింగ్ ఠాకూర్, సత్పాల్ రైజడ, వినయ్ కుమార్ ఉన్నారు.తొలుత ఉదయం 11 గంటలకే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. వెనువెంటనే విపక్ష కాంగ్రెస్ నేతలు ఒక్కపెట్టున ఆందోళనకు దిగారు. విపక్ష నేత అగ్నిహోత్రి తన సీట్లోంచి లేచి నినాదాలు చేశారు. సభలో గందరగోళ పరిస్థితుల మధ్య గవర్నర్ తన ప్రసంగంలోని చివరి లైను మాత్రమే చదవి వినిపించారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి జై రామ్ ఠాకూర్, స్పీకర్ విపిన్ పార్మర్‌తో కలిసి బయటకు వస్తుండగా స్పీకర్ ఛాంబర్ వద్ద గవర్నర్‌ను నిలువరించేందుకు విపక్ష ఎమ్మెల్యేలు ప్రయత్నించారు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. సభ తిరిగి సమావేశం కాగానే, గవర్నర్‌ను ఘెరావ్ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి సురేష్ భరద్వాజ సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో ఓటమితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర నిరాశ చెందడాన్ని ఈ చర్య ప్రతిబింబిస్తోందని అన్నారు. అనంతరం, ఐదుగురు ఎమ్మెల్యేలను తక్కిన బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకూ సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ విపిన్ పార్మర్ ప్రకటించారు. ఆయన ఈ ప్రకటన చేసినప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సభలో లేరు.

కాగా, గవర్నర్ ప్రసంగ పాఠంలోని విషయాలన్నీ పూర్తిగా అవాస్తవాలని కాంగ్రెస్ నేతలు తప్పుపట్టారు.

వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు చుక్కలనంటడాన్ని ప్రసంగ పాఠంలో చేర్చలేదని అన్నారు. కాగా, షెడ్యూల్ ప్రకారం బడ్జెట్ సమావేశాలు మార్చి 20తో ముగియాల్సి ఉన్నాయి.

# రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోంది

## కుప్పంలో డబ్బులు పంచి వ్యవస్థను అపహాస్యం చేశారు

## ఇక్కడే మకాం వేసి మున్సిపల్ ఎన్నికల్లో తడాఖా చూపుతా

## వైకాపాకు డిపాజిట్లు రాకుండా చేస్తా

## కుప్పం పర్యటనలో చంద్రబాబు ఆగ్రహం

చిత్తూరు,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): కుప్పం జగన్ జాగీరు కాదని వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుప్పంలోనే మకాం వేసి..వైసీపీకి డిపాజిట్ రాకుండా చేస్తానని స్పష్టం చేశారు. పుంగనూరులో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేశారని ఆరోపించారు. ఇసుక అమ్ముతూ పేదల రక్తాన్ని జలగల్లాగా తాగుతున్నారన్నారు. రాజధాని, ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కు మొత్తం పోయాయని మండిపడ్డారు. జెట్ స్పీడుతో వైసీపీపై పోరాటం చేద్దామని బాబు పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో జనం బెంబేలెత్తి పోతున్నారన్నారు. పోలవరం, విశాఖ, అమరావతి అన్ని పోయాయని.. పోవడం తప్ప తెచ్చేవి ఏమీ లేదని వ్యాఖ్యానించారు. పుంగనూరులో పెద్దిరెడ్డికి డిపాజిట్ కూడా లేకుండా చేస్తానని అన్నారు. గేరు మార్చి తన తడాక చూపిస్తానని హెచ్చరించారు. రైతులను నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్ర చందన, ఇసుక స్మగ్లింగ్ ద్వారా పెద్దిరెడ్డి దోచుకుంటున్నారని ఆరోపించారు. డబ్బులు తెచ్చి కుప్పంలో ఓటర్లకు పంచి వ్యస్థను నాశనం చేశారన్నారు. తెగించి ముందుకు పోవాలని కార్యకర్తలకు తెలిపారు. రౌడీ రాజ్యం నడుస్తోందని చంద్రబాబు విమర్శలు గుప్పించారు. రెండో కుప్పం నియోజకవర్గం కడపల్లి పంచాయతీ పోడూరు గ్రామంలో పర్యటించిన చంద్రబాబు పీఈఎస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త క్రిష్ణప్ప కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతి చెందిన క్రిష్ణప్ప కుటుంబానికి పార్టీ తరపున రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని చంద్రబాబు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా శుక్రవారం రాజ్‌పేట్‌లో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రం కుక్కలు చంపిన విస్తరి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం, అరాచకపాలన సాగుతోందని, జగన్మోహన్ రెడ్డి ఒక డ్రామారాయుడు అని మండిపడ్డారు. రాష్ట్రాన్ని స్వాహా చేయాలని కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాను ఎందుకు సాధించలేదని ఆయన ప్రశ్నించారు. యువత భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి కూడా తనను విమర్శిస్తాడా..? అని చంద్రబాబు ప్రశ్నించారు. రామకుప్పం బహిరంసభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎప్పుడైనా నిలిచి గెలిచావా సజ్జల అని నిలదీశారు. తనను విమర్శించే ముందు నీ అర్హత ఏంటో తెలుసుకో..? అని ప్రశ్నించారు. కరెక్టుగానే మాట్లాడుతున్నా.. మాటతూలి ఎక్కడా మాట్లాడడం లేదని, ప్రజా బలం తనకుందన్నారు. తాను బసచేసిన గెస్ట్‌హౌస్‌లో విద్యుత్ సరఫరా ఎందుకు ఆపారు..? అని మరోసారి ప్రశ్నించారు. జనరేటర్ పనిచేయకుండా చేశారని, జడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉన్న తనను అవమానించేలా ప్రవర్తించారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

# పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు అస్వస్థత

గుంటూరు,ఫిబ్రవరి26(ఆర్ఎన్ఎ): పొత్తూరు సిస్టర్ కేర్ కాలేజీలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉన్నట్టుండి పడిపోయిన 11 మంది విద్యార్థులను జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షలు రాయడం కోసం వచ్చిన విద్యార్థులు.. అస్వస్థతకు గురికావడం సంచలనం సృష్టించింది. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై కాలేజీ యాజమాన్యం, తల్లిదండ్రులలో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com